ప్రజాశక్తి
సోమవారం 6, ఫిబ్రవరి 2022



కదిరిలో పోలీసుల మిలియన్ మార్చ్

కదిరి టౌన్ : ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశాల మేరకు కదిరి డీఎస్పీ భవ్య కిషోర్ ఆధ్వర్యంలో కదిరి పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద కవాతును ఆదివారం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుండి మారుతి సర్కిల్,జీవిమాను సర్కిల్, నానా దర్గా, మార్కెట్ , ఈక్బాల్ రోడ్, చౌక్ బజార్, హిందూపూర్ క్రాస్, రాయలసీమ సర్కిల్,వేమారెడ్డి సర్కిల్ , అంబేద్కర్ సర్కిల్ వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా అకింపేట 99 వ బెటాలియన్ రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ వినోద్, డీఎస్పీ భవ్య కిషోర్ భవ్య కిషోర్ మాట్లాడుతూ ప్రజాభద్రత దృష్ట్యా ప్రజల విశ్వాసాన్ని నమ్మకాన్ని కొనసాగిస్తూ జిల్లా పోలీసుల అధికారుల సహకారంతో కవాతును నిర్వహించామన్నారు. ఈకార్యక్రమంలో సిఐలు మధు, సూర్యనారాయణ, శంకర్ నాయక్, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



హిందూపురం 16వ వార్డు సచివాలయంలో సెక్రెటరీల పక్కనే కూర్చొని ఆదేశిస్తున్న వాలంటీర్లు

పురంలో వాలంటీర్లదే పెత్తనం..

సెక్రెటరీలకే హుకుం జారీ చేస్తున్న వైనం

ప్రజాశక్తి-హిందూపురం

'మేము జగనన్న వారుసులం..సచివాలయాల్లో తాము చెప్పిందే వేదం..తాము చెప్పినట్లే వార్డు సెక్రెటరీలు వినాలి..లేదంటే వార్డు కౌన్సిలర్‌కు చెప్పి మీపై ఎమ్మెల్సీకి ఫిర్యాదు చేస్తాం'.. అంటూ సచివాలయాల్లో వార్డు వాలంటీర్లు సెక్రెటరీలపై పెత్తనం చెలాయిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లు బరించలేని సెక్రెరీలు అధికారుల కన్నా వాలంటీర్లు చెప్పిందే వేదం అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసి, సంక్షేమ పథకాల ఫలాలు అర్హులందరికీ అందించాలన్న సంకల్పంతో రెండేళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను అమల్లోకి తెచ్చింది. ఈ వ్యవస్థ ఆశయాలు ఘనంగా ఉన్నా..అమలులో మాత్రం కనిపించడం లేదు. ఒక్కో సచివాలయంలో వివిధ శాఖలకు సంబంధించి 10 మంది సెక్రెటరీలను నియమించారు. వీరికి తోడు ప్రతి 50 ఇళ్లకు ఒక వార్డు వాలంటీర్‌ను నియమించారు. వార్డు వాలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి, అర్హులను ఎంపిక చేసి దరఖాస్తులను చేయించాల్సిన భాధ్యత వారిపై ఉంది. అయితే హిందూపురం పురపాలక సంఘంలో ఇలా జరగడం లేదు. వార్డు వాలంటీర్లు అంటే కేవలం నెల ప్రారంభంలో మాత్రం వెల్ఫేర్ సెక్రెటరీలతో కలిసి సామాజిక పింఛన్లను పంపిణీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. మిగిలిన రోజుల్లో కొంతమంది వేరే పనులు చేసుకుంటున్నారు. మరి కొంతమంది సచివాలయాల్లో పెత్తనం చెలాయిస్తున్నారు. పురపాలక సంఘంలోని 16వ వార్డులో తౌసిఫ్, జహీర్ బాషా అనే ఇద్దరు వార్డు వాలంటీర్లు వెల్ఫేర్ సెక్రెటరీతో సమానంగా కూర్చొని, సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ, జోకులు వేసుకుంటు కాలక్షేపం చేస్తుండడమే ఇందుకు ఉదాహరణ.

ప్రజలకు అందని సేవలు..

సచివాలయ వ్యవస్థ ద్వారా 540 రకాల సేవలను అందించాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ సేవలని వార్డు వాలంటీర్లు, వార్డు సెక్రెటరీలు కలిసి అందిచాల్సి ఉంది. అయితే కొంతమంది వార్డు వాలంటీర్ల నిర్లక్ష్యం కారణంగా 540 రకాల సేవల్లో సగం కూడా ప్రజలకు అందడం లేదు.

వార్డుల్లో కనిపించని వాలంటీర్లు..

ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ఇతర సేవలను అందించాలని ప్రభుత్వం వార్డు వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చింది. దీని కోసం వారికి ప్రతి నెల రూ.5 వేలు గౌరవ వేతనం ఇస్తోంది. నిత్యం వాలంటీర్లు వార్డులో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ప్రజలకు అవసరమైన కులం, ఆదాయం, మరణ, జనన వంటి ధ్రువీకరణ పత్రాలను ఏలా పొందాలన్న వివరాలను వివరించాలి. వారితో దరఖాస్తులను తీసుకుని, సచివాలయానికి వచ్చి సంబందిత వార్డు సెక్రెటరీకి ఇచ్చి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించాలి. నిర్ణీత గడువులోగా వారికి అందించాల్సిన అవసరం ఉంది. అయితే ఈ పనులు తమవి కాదు అన్నట్లు వాలంటీర్లు వ్యవహరిస్తున్నారు. కేవలం నెలలో రెండు రోజులు పింఛన్లు పంపిణీ చేసి చేతులు దులుపుకుంటూ ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. దీనిపై ఆయా మున్సిపల్ కమిషనర్, మండల స్థాయిలో మండల అభివృద్ధి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. సచివాయాలను తనిఖీ చేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డు వాలంటీర్లపై చర్యలు తీసుకోవాలి. వీలైతే అలాంటి వారిని తొలగించి వారి స్థానంలో మరొకరిని నియమించాలి. ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా చూడాల్సి ఉంది.

అప్పర్ భద్రతో రాయలసీమకు నష్టం

ఐక్య పోరాటానికి సన్నద్ధమవ్వాలి
రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కర్నాటక చేపట్టిన అప్పర్ భద్రా ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేకుండా జాతీయ హోదా గుర్తింపు నిచ్చి, కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించడం రాయలసీమ ప్రాంతానికి తీరని నష్టం చేకూర్చడమేనని, ఇది ఆక్షేపణీయమని వక్తలు పేర్కొన్నారు. తక్షణం ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపివేయించాలని డిమాండ్ చేశారు. ఐక్య పోరాటానికి సన్నద్ధమవ్వాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో 'అప్పర్ భద్ర నిర్మాణం-జిల్లా నీటివనరులకు ప్రమాదం' అన్న అంశంపై ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వైసిపి, బిజెపి మినహా టిడిపి, సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసి, కాంగ్రెసు పార్టీల నాయకులతోపాటు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. సమావేశంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలువ శ్రీనివాసులు మట్లాడుతూ.. అప్పర్ భద్ర ప్రాజెక్టుకు అనుమతులివ్వడాన్ని బచావత్ ట్రిబ్యునల్ ఆనాడే వ్యతిరేకించిందని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల రాయలసీమ జిల్లాలకు తీరని నష్టం చేకూరుతుందని చెప్పారు. నదీ జలాల మళ్లింపు ద్వారా వచ్చే మిగులు పేరుతో ఇప్పుడు బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు పెట్టినా ఇంకా అది న్యాయ స్థానంలోనే ఉందని చెప్పారు. అక్కడ అడిగింది కూడా తొమ్మిది టిఎంసిలేనని తెలిపారు. అయితే కర్నాటకలో చేపడుతున్న ప్రాజెక్టు వల్ల సుమారు 40 టిఎంసిల వరకు ఎగువ భాగంలోనే నీటిని తోడేసుకునే అవకాశముందన్నారు. దీని వల్ల తుంగభద్ర డ్యామ్‌కు నీరు చేరడం ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయన్నారు. హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సికి వచ్చే నీటి వాటాల్లో కోతలు పడనున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతానికి చెందిన అందరం రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా పోరాడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కర్నాటకలో త్వరలో జరగబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అప్పర్ భద్రకు జాతీయ హోదాను కల్పించడమే కాకుండా రూ.5300 కోట్లు నిధులు కేటాయించిందని తెలిపారు. రాష్ట్ర విభజన హామీల్లో ఒకటిగానున్న పోలవరం ప్రాజెక్టుకు మాత్రం 2011 నాటి ధరలతోనే నిధులు కేటాయిస్తామని చెబుతూ.. కర్నాటకలోని అప్పర్ భద్రకు మాత్రం కొత్త ధరలకు అనుగుణంగా నిధులు కేటాయించడం ఆ పార్టీ ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోందని విమర్శించారు. పక్క రాష్ట్రాల అభ్యంతరాలను సైతం పట్టించుకోకుండా, సిడబ్ల్యుసి (సెంట్రల్ వాటర్ కమిషన్) నియమాలను కూడా పట్టించుకోకుండా ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించడం అన్యాయమన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని రూపొందించాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతానికి నష్టం చేకూర్చే విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరు ఉందన్నారు. దీనికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను చేపట్టాల్సి ఉందని చెప్పారు.

సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి నాయకులు ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే కర్నాటకలో అనుమతుల్లేని ప్రాజెక్టుకు నిధులు కేటాయించిందని విమర్శించారు. మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా మాట్లాడుతూ ఎటువంటి అనుమతుల్లేని అక్రమ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి, జాతీయ హోదాను కేటాయించడం అప్రజాస్వామిక చర్య అని అన్నారు. ఇది కేవలం రాయలసీమ ప్రాంతానికి జరిగిన అన్యాయంగానే చూడలేమని అన్నారు. ప్రజాస్వామిక విలువలకు విరుద్ధమైన, దుర్మార్గమైన చర్య అని ఖండించారు. జల సాధన సమితి నాయకులు గంగిరెడ్డి మాట్లాడుతూ ఈ సమస్యపై ప్రజాప్రతినిధులపై తీవ్రమైన ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరముందన్నారు. క్షేత్ర స్థాయి నుంచి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి పెద్ద పోరాటాన్ని రూపొందించడం ద్వారానే ఈ ప్రాంతానికి జరిగే అన్యాయాన్ని ఆపగలమని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెసు నాయకులు దాదాగాంధీ, ఎపి రైతు సంఘం (సిపిఐ) జిల్లా కార్యదర్శి చెన్నప్ప, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, అనంత హక్కుల వేదిక నాయకులు రసూల్, ఐద్వా రాష్ట్ర నాయకులు సావిత్రి, డివైఎఫ్ఐ నాయకులు నరసింహారెడ్డి, సిఐటియు నాయకులు రామాంజినేయులు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న

కేంద్రం రైతులను ముంచేందుకు సిద్ధమవుతోంది

ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి
ఏప్రిల్ 5న చలో ఢిల్లీని జయప్రదం చేయాలని పిలుపు



సదస్సులో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికులు, రైతులను నిలువునా ముంచడానికి సిద్ధమైందని, దీనిని వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5వ తేదీన చేపట్టిన చలో పార్లమెంటు ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పుట్టపర్తిలోని సిఐటియు కార్యాలయంలో కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. రైతు సంఘం అధ్యక్షుడు పెద్దన్న, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ప్రవీణ్, సిఐటియు అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతాంగాన్ని మోసం చేసిందన్నారు. దేశవ్యాప్తంగా రైతులు వ్యవసాయ నష్టాలతో అప్పుల ఊబిలో కూరుకుపోయారని ఆవేదం వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలకు రుణమాఫీ చేస్తున్న కేంద్రం ప్రభుత్వం రైతుల పంట రుణాలను ఎందుకు మాఫీ చేయలేదని ప్రశ్నించారు. .కేరళ తరహాలో రైతు రుణ వివేచన చట్టం తీసుకువచ్చి రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని కోరారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఆపాలన్నారు. సమగ్ర పంటల బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమంలో అమరులైన రైతు కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. రైతులపై బనాయించిన అక్రమ కేసులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం ఉత్పత్తి ఖర్చులు అదనంగా 50 శాతం కలిపి అన్ని పంటలకు మద్దతు ధర కల్పించాలన్నారు. జిల్లాలో రైతుల పంటలను ఆర్‌బికె కేంద్రాల్లో కొనుగోలు చేసే విధంగా చూడాలన్నారు. కార్మికులకు నెలకు రూ.26 వేలు కనీస వేతనం, రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. పేద, మధ్య తరగతి రైతు, వ్యవసాయ కార్మికుల అప్పులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. 60 సంవత్సరాలు దాటిన వారందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక, రైతాంగ సమస్యలపై ఏప్రిల్ 5 వతేదీన చేపట్టాన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఇంతియాజ్, సిఐటియు అధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టి.ప్రవీణ్ కుమార్, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

నందకి లేఅవుట్ ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణ సమీపంలో కిరికెర వద్ద ఎల్ఆర్‌జి విద్యాసంస్థల ఎదురుగా ఉన్న స్థలంలో ప్రముఖ వ్యాపార వేత్త, వైసిపి నాయకులు కొండురు వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లే అవుట్‌ను ఎమ్మెల్సీ ఇక్బాల్, పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ, ప్రముఖ వ్యాపార వేత్త, సుపర్ స్పిన్నింగ్ మిల్స్ అధినేత సుమంత్ రమూర్తి ఆదివారం ప్రాంరభించారు. అనంతరం లే అవుట్‌కు సంబందించిన బ్రోజర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కొండూరు వేణుగోపాల్ రెడ్డి తన మిత్రులు అమర్నాథ్, అశ్విన్, పుల్లారెడ్డిల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన లే అవుట్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. అన్ని అనుమతులు పొందిన స్థలంలో లే అవుట్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం లేఅవుట్ ప్రారంభోత్సవానికి వచ్చిన వారిని చిత్ర పరిశ్రమకు చెందిన మిమిక్రి ఆర్టిస్ట్ శివారెడ్డి, యాక్టర్ హరితేజ, సత్యాయమిని, మానసా ఆచార్య, కిరణ్‌ల ఆట పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు అబ్దుల్ ఘనీ, ఎపిఐఐసి మెంబర్ కెటి. శ్రీధర్, తాడిపత్రి శాసనసభ్యులు కేతిరెడ్డి పెద్దారెడ్డి కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి, వ్యాపార వేత్త నరేంద్రనాథ్, బయోటెక్ ఆనంద్ రెడ్డి, రెడ్డి సంఘం నాయకులు ఈశ్వర్ రెడ్డి, కిరికెర సర్పంచి మూర్తి, రూరల్ సిఐ కృష్ణారెడ్డి, కౌన్సిలర్ రాఘవేంద్ర, భాస్కర్ రెడ్డి, కృపాకర్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రతో వైసిపికి ఓటమి భయం : టిడిపి

ప్రజాశక్తి - మడకశిర

నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు రోజురోజుకీ పెరుగుతున్న ప్రజాదరణ చూసి తాడేపల్లి ప్యాలెస్ లో ఉన్న జగన్‌కి ఓటు భయం పట్టుకుందని మాజీ ఎమ్మెల్యే ఈరన్న అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ కొందరు అధికారులు, పోలీసులను తన చెప్పుచేతుల్లో పెట్టుకుని పాదయాత్రకు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. బంగారుపాళ్యంకు పాదయాత్ర చేరుకోగానే విద్యుత్ సరఫరా నిలిపివేశారన్నారు . అనుమతులు ఉన్నా మూడు వాహనాలు సీజ్ చేశారని విమర్శించారు. నిబంధనలు ఉల్లంఘించారంటూ లోకేష్ బాబు తో పాటు టిడిపి నాయకులు మీద కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో వక్కలిగ రాష్ట్ర కమిటీ చైర్మన్ వి.ఎం.పాండురంగప్ప, జిల్లా కార్యదర్శి రవిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న

సిపిఎస్‌కు ప్రత్యామ్నాయం ఒపిఎస్ మాత్రమే

సంకల్ప దీక్షలో యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

సిపిఎస్‌కు ప్రత్యామ్నాయం జిపిఎస్ కాదని..ఒపిఎస్ మాత్రమేనని యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. సిపిఎస్ రద్దు కోసం ఈ నెల 3వ తేదీన విజయవాడ ఏలూరు మధ్య ధర్మస్థలి ప్రాంగణంలో జరుప తలపెట్టిన సంకల్ప దీక్షను ప్రభుత్వం పోలీసుల చేత భగ్నం చేయించడాన్ని ఖండించారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సంకల్ప దీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ హాజరై మాట్లాడుతూ.. పాదయాత్ర సందర్భంగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే వారం రోజుల్లోపు సిపిఎస్‌ను రద్దు చేస్తారని హామీ ఇచ్చారన్నారు. నాలుగేళ్లు కావస్తున్న సిపిఎస్‌ను రద్దు చేయకపోగా దాని స్థానంలో అతి దుర్మార్గమైన జిపిఎస్‌ను తీసుకురావడం ఉద్యోగ ఉపాధ్యాయులను మోసం చేయడమే అన్నారు. పెన్షన్ బిక్ష కాదు.. ఉద్యోగుల హక్కు అని అన్నారు. వెంటనే సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ సిపిఎస్ విధానం ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా మంచిది కాదు అని అంటూనే ప్రభుత్వం తాము ప్రతిపాదిస్తున్న గ్యారెంటెడ్ పెన్షన్ స్కీమ్ విధానమే మేలైనదని చెబుతోందన్నారు. జిపిఎస్, సిపిఎస్ రెండూ ఒకటేనన్నారు. జిపిఎస్ మంచిదని చెప్పడం ఉద్యోగ ఉపాధ్యాయులను మోసం చేయడమే అని అన్నారు. ప్రధాన కార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని కోరారు. ఇప్పటికే దేశంలో జార్కండ్, రాజస్థాన్, చత్తీష్‌ఘడ్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలలో సిపిఎస్‌ను రద్దుచేశారని గుర్తు చేశారు. తమిళనాడులో కూడా సిపిఎస్‌ను రద్దు చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. త్రిపురలో కూడా ఎన్నికల మేనిఫెస్టోలో సిపిఎస్ రద్దు చేస్తామని చేర్చారన్నారు. మన రాష్ట్రంలో ఇచ్చిన హామీని నెరవేర్చక పోగా దాని స్థానంలో అతి దుర్మార్గమైన జిపిఎస్ విధానాన్ని తీసుకురానుండడం 3.30 లక్షల ఉద్యోగ ఉపాధ్యాయులను మోసం చేయడమే అని అన్నారు. దీనిని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసే వరకు యుటిఎఫ్ పోరాడుతూనే ఉంటుందన్నారు. ఈ పోరాటంలో కలిసివచ్చే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులతో కలిసి ఐక్య పోరాటాలు చేస్తామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండి వైఖరిని విడనాడి సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు రమణయ్య, సహ అధ్యక్షులు రామప్ప , జిల్లా కార్యదర్శి అర్జున్, రాష్ట్ర కౌన్సిలర్ ఈశ్వరయ్య, ఆడిట్ కన్వీనర్ అబ్దుల్ వహాబ్, సీనియర్ నాయకులు మహమ్మద్, సుధాకర్, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.



సంకల్ప దీక్ష నుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టరు గేయానంద్

వైభవంగా బ్రహ్మరథోత్సవం

అమరాపురం : మండల కేంద్రంలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం వైభవంగా ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవం చేపట్టారు. ఈసందర్భంగా ఎలాంటి సంఘటన చోటు చేసుకోకుండా ఎసిఐ రామాంజనేయులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. అమరాపురం సర్పంచి వాగేష్ ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

వెలగని వీధి దీపాలు

నంబులపూలకుంట : మండల కేంద్రంలోని ఇంద్ర కాలనీ వద్ద వీధి దీపాలు వెలగకపోవటంతో ఆ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు సంవత్సరాల నుండి మండలకేంద్రంలోని పలు వీధులలో వీధి దీపాలు వెలగడం లేదు. సమస్యను అధికారులకు, సర్పంచికి తెలిపినా పట్టించుకోవటం లేదని ఆయా కాలనీల వాసులు వాపోతున్నారు. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి సమయంలో వృద్ధులు, చిన్నపిల్లలు బయటికి రావాలంటే భయాందోళన చెందుతున్నారు. రాత్రి అయితే గ్రామంలో అంధకారం నెలకొంటోంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వీధిదీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టిడిపిలోకి వెళ్లడానికే ట్యాపింగ్ డ్రామా : మంత్రి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జయరాం, తదితరులు

ప్రజాశక్తి కదిరి అర్బన్

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి టిడిపిలోకి వెళ్లడానికే ఫోన్ ట్యాపింగ్ డ్రామా ఆడుతున్నాడని, వైసిపి ప్రభుత్వానికి ఫోన్లు ట్యాపింగ్ చేసే అవసరం లేదని రాష్ట్ర కార్మికశాఖామంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. కదిరి పట్టణంలో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఎమ్మెల్యేలు సిద్ధారెడ్డి, శంకరనారాయణ, ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ, కలెక్టర్ బసంత్‌కుమార్, ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్, ఎస్సీ రామకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్ నూతన భవనం ప్రారంభం సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆగిపోయిన నూతన పోలీస్ స్టేషన్ల నిర్మాణ పనులను వైసిపి ప్రభుత్వం పూర్తి చేసి ప్రారంభిస్తోందన్నారు. శ్రీధర్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ ప్రస్తావన తీసుకురాగా ఫోన్ ట్యాపింగ్ చేయడం వైసిపికి, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అవసరం లేదన్నారు. పార్టీ మారడం కోసం ఆయనే ట్యాపింగ్ డ్రామా ఆడుతూ సొంత పార్టీపై బురద జల్లుతున్నాడని విమర్శించారు. లోకేష్ యువగళం పాదయాత్ర రోజు రోజుకు ప్రజా ప్రజాదరణ కోల్పోతుందని, పాదయాత్ర కొనసాగించలేక మధ్యలోనే ఆగిపోతుందని జోష్యం చెప్పారు.

అగ్ని ప్రమాదంలో వ్యక్తి సజీవదహనం

ఉరవకొండ : వజ్రకరూరు మండలం పందికుంట గ్రామంలో ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకుని అందులో నివసిస్తున్న నాగప్ప (75) సజీవ దహనమయ్యారు. మృతి చెందిన వృద్ధుడికి ఎవరూ లేకపోవడంతో కొన్నేళ్లుగా గ్రామ శివారులో చిన్నపాటి గుడిసె వేసుకుని జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకుని సజీవదహనం అయినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

120 చీనీ చెట్ల నరికివేత

పుట్లూరు : పెద్దపప్పూరు మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రజాశక్తి విలేకరి భాస్కర్‌కు చెందిన 120 చీనీ చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి నరికివేశారు. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. దాదాపు సంవత్సరం రెండు నెలల వయసున్న చీనీచెట్లను గుర్తు తెలియని దుండగులు నరికినట్లు వాపోయాడు. ఆదివారం ఉదయం తోటలో ఎరువు వేసేందుకు కూలీలతోపాటు వెళ్లిన భాస్కర్ నరికిన చీనీ చెట్లను చూపి దిగ్భ్రాంతికి గురయ్యాడు. అప్పులు చేసి మరీ పంటను చేసుకుంటుండగా గుర్తుతెలను వ్యక్తులు నరికేశారని ఆందోళన వ్యక్తం చేశాడు. దీంతో దాదాపు రూ.30 నుంచి రూ.45 వేల దాకా నష్టం వచ్చినట్లు రైతు వాపోయాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజారామ్‌రెడ్డి

తాడిపత్రి రూరల్ : పెద్దపప్పూరు మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు బెడుదూరు భాస్కర్‌కు చెందిన 150 చెట్లను నరికిన నిందితులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజారామ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వృత్తి రిత్యా జర్నలిస్టు అయిన భాస్కర్ చీనీ చెట్లనే నరికేశారంటే ఇక సామాన్య రైతుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థమవుతోందన్నారు. కావున పోలీసులు వెంటనే సాంకేతికతను ఉపయోగించి చెట్లు నరికిన దుండగులను గుర్తించి అరెస్టు చేయాలన్నారు. అలాగే ఘటనపై కలెక్టర్ స్పందించి నష్టపోయిన రైతు భాస్కర్ కు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

భగత్‌సింగ్ సేవా సమితి ఖాతాలో మరో జాతీయ అవార్డు



ప్రశంసాపత్రాలతో సేవా సమితి ప్రతినిధులు

ప్రజాశక్తి - పరిగి

పరిగి,హిందూపురం మండలాల వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న భగత్ సింగ్ సేవా సమితి ఖాతాలో మరో జాతీయ అవార్డు చేరింది. చెన్నైకి చెందిన అమెరికన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ యూరోపియన్ అచీవర్స్ 2023 కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులు సద్దాం హుస్సేన్ ది బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డ్‌ను భగత్ సింగ్ సేవాసమితికి ప్రకటించారు.ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ సభ్యులు శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నారు. గత కొన్ని ఏళ్లుగా గ్రామంలో పలువురు నిరుపేదలకు అన్నం పాకెట్ల పంపిణీ, చలికాలంలో హిందూపురం పరిసర ప్రాంతాల్లో ఇబ్బంది పెడుతున్న బిక్షగాళ్లకు దుప్పట్లు పంపిణీ, పండుగలు ప్రతి నిరుపేద ఇంట పండుగ వాతావరణం కొనసాగాలని ఉద్దేశంతో వందల కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాలను భగత్‌సింగ్ సేవా సమితి చేపడుతోంది. అంతేకాకుండా ప్రతి విద్యార్థికి అనువుగా భగత్ సింగ్ సేవా సమితి లైబ్రరీ ఏర్పాటు, గ్రామీణ ప్రాంతాలలో ప్రధాన రోడ్లలో గుంతల మయంగా ఉన్న రోడ్లకు యువకుల ఆధ్వర్యంలో మరమ్మతులు ఏర్పాటు వంటి కార్యక్రమాలను నిర్వహించింది. వీరి గుర్తించిన వారు ఈ అవార్డును ప్రకటించడం చాలా ఆనందంగా ఉందని కమిటీ సభ్యులు కార్తీక్, వేణుగోపాల్, ప్రసన్న లీల, సంతోష్, ఆంజనేయులు, హరి తెలిపారు. మరిన్ని కార్యక్రమాలు ప్రజా శ్రేయస్సు కోసం నిర్వహిస్తామని వారు అన్నారు. ఈ సేవా కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించిన పలువురు దాతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి చేయూత

ప్రజాశక్తి ధర్మవరం టౌన్



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న కౌన్సిలర్ డోలా ఓబులమ్మ, డోలా రాజారెడ్డి

స్థానిక దుర్గా నగర్ లో త్వరలో ప్రారంభించనున్న శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రతిష్ట ఉత్సవ కార్యక్రమాలకు ధర్మవరం డివిజన్ ఆర్టీసీ డిపో గౌరవ అధ్యక్షులు డోలా రాజారెడ్డి దంపతులు తమ వంతు చేయూతను అందించారు. 27వ వార్డు కౌన్సిలర్ డోలా ఓబులమ్మ తమ నివాసంలో కమిటీ సభ్యులకు రూ 10 వేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా డోలా రాజారెడ్డి మాట్లాడుతూ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ప్రతిష్ట ఉత్సవ కార్యక్రమాలకు అవసరమైతే మరింత ఆర్థిక సాయం అందజేస్తాననిహామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సాకే చిన్నికృష్ణ, రాము, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హయ్యర్ ఆప్షన్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోండి

కదిరి టౌన్ : ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు హయ్యర్ ఆప్షన్ సౌకర్యాన్ని సద్వినియగం చేసుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిమోహన్ తెలిపారు. ఎన్ఎంయు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రిటైర్డు ఉద్యోగుల సభలో పాల్గొన్న ఆయన హయ్యర్ ఆప్షన్ సౌకర్యం, ప్రయోజనాలను వివరించారు. రిటైర్డు అయి ఈ మధ్యన మృతిచెందిన ఎడిసి ఇద్రిస్, డ్రైవర్ శేఖర్, కండక్టర్ బాషా మృతికి ఈసందర్భంగా సంతాపం ప్రకటించారు.వారి కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌సిఎం. బాషా, ప్రధాన కార్యదర్శి జి.గోపాలకృష్ణ, ట్రెజరర్ నరసింగ రావు, సీనియర్ నాయకులు తాహీర్, కె.పక్కీరారెడ్డి, ఆంజనేయులు, క్రిష్ణమ్మ, గంగాదేవి, ఆరిఫుల్లా తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా బ్రహ్మరథోత్సవం

హిందూపురం : హిందూపురంలో శ్రీ పేట వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవం వేడుకల్లో భాగంగా ఆదివారం స్వామివారి బ్రహ్మ రథోత్సవం కన్నుల పండువగా సాగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు కర్నాటక, తమిళనాడుతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. దేవాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవారిని శ్రీదేవి భూదేవిల అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఆలయ కమిటీ నిర్వహకుల ఆధ్వర్యంలో ఊరేగించారు. వైసిపి, టిడిపి నాయకులు రథాన్ని లాగి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇక్బాల్, ఎపి ఆగ్రోస్ ఛైర్మన్ నవీన్ నిశ్చల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, టిడిపి అంబికా లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు పట్టణంలోని పలు సేవా సంఘాలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వాసవి క్లబ్, భగీరథ టెక్స్‌టైల్స్ నిర్వహకులు నవీన్ చంద్ర అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ లబ్దుల్ కరీం వారి సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు వైసిపి, టిడిపి కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, వాసవి క్లబ్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఊరటనిస్తున్న మామిడిపూత

కదిరి అర్బన్ : మామిడి తోటల్లో పూత వస్తుండటంతో రైతులకు ఊరట కలుగుతోంది. మామిడి తోటల యజమానులు తమ తోటలో వస్తున్న మామిడి పూత చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అవసరమైన మందులను పిచికారి చేసుకుంటూ పూతను కాపాడుకునేందుకు కృషి చేస్తున్నారు. అయితే ఎకరా మామిడి చెట్లకు మందు పిచికారి చేయాలంటే నాలుగు వేల రూపాయల నుండి 5వేల రూపాయల వరకు ఖర్చు వస్తుందని టాక్టర్ అద్దె కూడా వెయ్యి రూపాయలు అవుతుందని రైతులు చెబుతున్నారు. మామిడి తోటలను కాపాడుకునేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందడం లేదని వాపోతున్నారు. నియోజకవర్గ పరిధిలోని గాండ్లపెంట మండలంలోని కమతంపల్లి గ్రామ రైతు షేక్ సబ్జాన్ మాట్లాడుతూ తాను 11 ఎకరాల మామిడి తోటను కౌలుకు తీసుకొని ప్రతి సంవత్సరం పెట్టుబడి పెట్టి సాగు చేసుకుంటున్నానని అన్నారు. చివరికి పంట దిగుబడి వచ్చేసరికి అనావృష్టి, అతివృష్టి కారణాలవల్ల నష్టపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యానవన శాఖ అధికారులు మామిడి తోటలవైపు కన్నెత్తి చూడటం లేదని విమర్శిస్తున్నారు. రైతుకు అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వడానికి కూడా అందుబాటులో ఉండటం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకున్న అనుభవంతోనే పూతను కాపాడుకునేందుకు ఉన్న మందులను ప్రైవేటు దుకాణాలలో అప్పులు చేసి తెచ్చుకొని పిచికారి చేస్తున్నామని చెబుతున్నారు. విపరీతమైన గాలులు, వేడికి, ఎక్కువ వర్షాలకు ఆశించిన రీతిలో మామిడి పూత నిలబడటం వాపోతున్నారు. మామిడి చెట్లని నమ్ముకుని నష్టమో, లాభమో వీటిపైనే జీవనశైలిని కొనసాగిస్తున్నామన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటికే పూతకు నాలుగు సార్లు మందును పిచికారి చేశామని రైతు సబ్జాన్ తెలిపారు. ప్రస్తుతం కాసిన పూత ఏమాత్రం నిలుస్తుందో వేచి చూడాల్సుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల్లో రైతులు మామిడి తోటలను సాగు చేస్తున్నారన్నారు. అరకొర అవగాహనతో మామిడి పూతను నిలుపుకునేందుకు ఏ సమయంలో ఏ మందు వాడాలో తెలియక తమకు తోచిన మందులు ఉపయోగించడం వల్ల కూడా రైతులు నష్టపోతున్నారన్నారు. వీరిలో కౌలు రైతుల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైందన్నారు. నష్టపోయిన రైతులను ప్రజాప్రతినిధులు కానీ సంబంధిత శాఖ అధికారులు కానీ పలకరించిన పాపాన పోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి రైతుకు సహాయ సహకారాలు అందించి సాగు చేసిన పంటల ద్వారా అధిక దిగుబడి వచ్చేందుకు సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.



కంటిపరీక్షలు నిర్వహిస్తున్న కంటి వైద్యనిపుణులు

కంటి వైద్యశిబిరానికి అనూహ్య స్పందన

ధర్మవరం టౌన్ : పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటివైద్యశిబిరానికి అనూహ్యస్పందన లభించింది. యువర్స్ ఫౌండేషన్ సౌజన్యంతో కర్నూలుకు చెందిన చక్ర ఆస్పత్రి వారిచే ఈ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో కంటి చూపు మందగించిన వారికి కంటి వైద్యనిపుణులు నాగరాజు, సురేశ్ పరీక్షలు నిర్వహించి కంటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు వైకే శ్రీనివాసులు మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెల పేదల కోసం ఉచిత కంటి వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ కార్యదర్శి సుంకు సుకుమార్, కోశాధికారి రాధాక్రిష్ణ, సభ్యులు చాంద్‌బాషా, డాక్టర్ సుబ్బారావు, పోలా ప్రభాకర్, బండ్లపల్లి రంగనాథ్, ఒవి. ప్రసాద్, రమేశ్ బాబు, జయరాం,మల్లికార్జున, పవన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పాల పొంగులు

బత్తలపల్లి : మాఘ మాసం దీక్షలు చేపట్టిన పలువురు మహిళలు మూడవ ఆదివారం ఆలయాల వద్ద భక్తిశ్రద్ధలతో పాల పొంగులు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామునే దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని సంజీవపురం కాటికోటేశ్వరక్షేత్రం, సంఘమేశ్వర క్షేత్రంలోనూ, మాల్యవంతం, రామాపురం, కోడేకండ్లలోని వీరనారాయణస్వామి, డి. చెర్లోపల్లి సిద్ధేశ్వరాలయం, దంపెట్ల చెన్నకేశవాలయం, ముపూరు, పోట్లకర్రె శివాలయంలోనూ, గంటాపురం అప్పస్వామి దేవాలయాల్లో పాల పొంగులు నిర్వహించారు. దీంతో ఆయా గ్రామాలలోని దేవాలయాల వద్ద పండగ సందడి నెలకొంది.

బైజూస్ ట్యాబ్ వినియోగంపై అవగాహన

ధర్మవరం టౌన్ : బైజూస్ ట్యాబ్‌ల వినియోగంపై జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి అవగాహన కల్పించారు. ఆదివారం పట్టణంలోని బిఎస్ఆర్ బాలుర ఉన్నతపాఠశాల, కొత్తపేట బాలుర ఉన్నతపాఠశాల, జెడ్పీ గర్ల్స్ హైస్కూల్లో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్షా కేంద్రాలను ఆమె తనిఖీచేశారు. పరీక్షల అనంతరం బిఎస్ఆర్ బాలుర ఉన్నతపాఠశాలలో 8వతరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్ ఎలా వినియోగించాలన్న అంశంపై అవగాహన కల్పించారు.

రజకులను ఎస్సీ జాబితాలోకి చేర్చాలి

ధర్మవరం టౌన్ : రజకులను ఎస్సీ జాబితాలోకి చేర్చాలని రజకసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సూర్యస్కూల్లో ఆదివారం రజక సంఘం ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి హాజరైన ఆంజనేయులు మాట్లాడుతూ రజకులను ఎస్సీజాబితాలోకి చేర్చాలని, రజకులకు రావాల్సిన ప్రభుత్వపథకాలన్నీ అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం భవిష్యత్తు కార్యాచరణపై చర్చిం చారు. త్వరలో పుట్టపర్తిలో జరగబోవు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు ప్రసాదు. నరేంద్ర, మహేశ్, నారాయణస్వామి, రాధాక్రిష్ణ, రమేశ్, వెంకటేశ్, రాజు, ముత్యాలప్ప తదతరులు పాల్గొన్నారు.

15న కల్యాణోత్సవం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని చెరువు కట్ట వద్దగల కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో ఈనెల 15న పార్వతిపరమేశ్వరుల కళ్యాణోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ద్వారకనాథ్ శర్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆలయంలో ఆయన శివమాలదారులతో కలిసి కల్యాణమహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదలచేశారు.

ఉత్సవాల నిర్వహణకు విరాళం

ధర్మవరం టౌన్ : స్థానిక 28 వార్డ్ కాలనీలో నిర్వహించే శివాలయం ఉత్సవాలకు ఆ వార్డు సర్పంచి భర్త సరితాల బాషా తనవంతుగా విరాళం అందజేశారు. సరితలా బాషా చిన్న కూతురు సరితలా విద్య జాస్మిన్ చేతులమీదుగా కమిటీ సభ్యులకు లక్ష రూపాయలను అందజేశారు.



విరాళం అందజేస్తున్న దృశ్యం

పార్టీ ప్రతిష్టను పెంచండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

గాండ్లపెంట : వైసిపి నాయకులు, గృహసారధులు, సచివాలయాల కన్వీనర్లు, వాలెంటీర్లు కలసి పార్టీ ప్రతిష్టను మరింత పెంచాలని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో గృహసారధులు, సచివాలయాల కన్వీనర్లు, వాలెంటీర్లకకు ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కొండవీటి నాగభూషణం, ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహసారధులు, సచివాలయ కన్వీనర్లు వాలెంటీర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకోవాలన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతం జగన్మోహన్, మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీలు గంగోజమ్మ, భారతి, జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డితో పాటు ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా గృహసారథులు పనిచేయాలని పుట్టపర్తి శాసనసభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో నూతనంగా ఎంపికైన గృహ సారథులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తిరుగుతూ తెలియజేయాలన్నారు. వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచి నాగలక్ష్మి రాజు , ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రత్నాకరం పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత గోవర్ధన్ రెడ్డి, అగ్రి అడ్వైజరీ చైర్మన్ రమణారెడ్డి, కన్వీనర్ సుధాకర్ రెడ్డి, నాయకులు నాగభూషణం, రామలింగారెడ్డి, ఎంపీటీసీ పద్మావతి, కేశప్ప, మల్లికార్జున, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

యువ గళం పాదయాత్రకు సంఘీభావం

ఓబుల దేవర చెరువు : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ బాబు చేపట్టిన యువగళం పాదయాత్రకు టిడిపి మండల నాయకులు తమ సంఘీభావం తెలిపారు. ఓబుల దేవర చెరువు తెలుగుదేశం పార్టీ నాయకులు హిందూపురం పార్లమెంటరీ తెలుగు రైతు మీడియా కోఆర్డినేటర్ జాకిర్ అహ్మద్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బడిసం రామాంజనేయులు తదితరులు లోకేష్‌బాబుతో కలసి పాదయాత్ర చేసి తమ సంఘీభావం తెలిపారు.



నారాలోకేష్‌తో స్థానిక టిడిపి నాయకులు

మార్చి 15 లోపు పంట రుణాలు రెన్యువల్ చేసుకోండి

ప్రజాశక్తి బుక్కపట్నం

మండల పరిధిలోని మారాల సహకార సంఘం పరిధిలో పంటరుణాలు తీసుకున్న రైతులు మార్చి 15వ తేదీ లోపల తమ రుణాలను రెన్యువల్ చేసుకోవాలని సహకార సంఘం అధ్యక్షుడు బాలం రమణారెడ్డి, సిఇఒ కమలాకర్ తెలిపారు. సకాలంలో రుణాలు రెన్యువల్ చేసుకుని ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీని పొందాలన్నారు.

ఒపిఎస్ సాధించే వరకు ఉద్యమం : యుటిఎఫ్



సంకల్ప దీక్షలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

ఒపిఎస్ విధానాన్ని అమలు చేసే వరకు ఉద్యోగ, ఉపాధ్యాయులుకలిసి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని యూటిఎఫ్, ఎపి ఎన్‌జిఒ సంఘం నాయకులు హెచ్చరించారు. సిపిఎస్‌ను (కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం) రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో సంకల్ప దీక్షను ఆదివారం చేపట్టారు. ఈ దీను ఎపి ఎన్‌జిఒ తాలూకా అధ్యక్షులు నరసింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు మారుతీ శ్రీనివాస్, నరసింహులు మాట్లాడుతు సిపిఎస్‌ను రద్దు చేయాలని 18 సంవత్సరాలుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళన చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తానని స్పష్టంగా హామీ ఇచ్చిందని అయితే తీరా అధికారంలోకి వచ్చాక జిపిఎస్ అంటున్నారని విమర్శించారు. జిపిఎస్ విధానం వలన ఉద్యోగులకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు ప్రశాంతంగా సంకల్ప దీక్షలు చేపడుతుంటే ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం దుర్మార్గమని విమర్శించారు. అక్రమంగా అరెస్టు చేసిన ఉపాధ్యాయులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రతినెలా 1న వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షకు ఎపి ఎన్‌జిఒ, ఎపి జెఎసి నాయకులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి, కార్యదర్శి నాగేంద్ర, నాయకులు భూతన్న, సిహెచ్ బాబు, సీతాలక్ష్మి, సుధాకర్, మారుతి, రామకృష్ణ, చెన్నకేశవులు, మహంతి, శ్రీనివాసులు, నగేష్‌తో పాటు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మతతత్వ పార్టీని ఓడించే శక్తి కాంగ్రెస్‌కే... : ఎపిసిసి అధ్యక్షులు



సమావేశంలో మాట్లాడుతున్న జంగా గౌతమ్

మడకశిర రూరల్ : దేశంలోనే అన్ని రాష్ట్రాల్లోనూ బిజెపికి పోటీ ఇచ్చేది కాంగ్రెస్ పార్టీనే అని రాబోయే ఎన్నికల్లో ఈ పార్టీని ఓడించే శక్తి కాంగ్రెస్ పార్టీకే ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ అన్నారు. మడకశిర పట్టణంలోనికోల్డ్ స్టోరేజ్ వద్ద ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న గౌతమ్ మాట్లాడుతూ దేశంలో రాహుల్ గాంధీ చేపట్టిన జడో పాదయాత్ర చారిత్రాత్మకమైందని అన్నారు. ఇలాంటి యాత్ర 50 ఏళ్లగా ఎవరు చేయలేదన్నారు. రాహుల్ గాంధీ పాదయాత్రకు మంచి స్పందన వచ్చిందన్నారు. భారతీయ జనతా పార్టీకి నిజమైన ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్యాకేజీ రావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. వైసిపి పాలనలో రాష్ట్ర వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందన్నారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూపురం : ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా ఇవ్వటం కాంగ్రెస్‌తోనే సాధ్యమని పిసిసి వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు సుధాకర్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాలకు చెందిన పలువురు పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతు మతతత్వ బిజెపి అధికారం కోసం ప్రజల మధ్యలో చిచ్చు పెడుతోందని విమర్శించారు. దత్త పుత్రులైన ఆదానీ, అంబానీలకు ప్రభుత్వ ఆస్తులను అప్పనంగా అప్పజెబుతోందన్నారు. ఎఐసిసి పిలుపు మేరకు ఆదానీ కంపెనీ అవకతవకలపై, ఎస్‌బిఐ, ఎన్ఐసి జాతీయ బ్యాంకుల భద్రత కోసం ధర్నా చేపడుతామన్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసి మెంబర్ కెటి శ్రీధర్, నాగరాజు, అమనూల్లా, యునుస్, జమీల్, రామాంజినేయులు, గంగాధరప్ప, శ్వామ్, హరిత, రఫిక్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.